

# అన్వేషి

సాయంత్రంఆరుగంటలవుతోంది. పనులన్నీ ముగించుకుని ఇల్లు చేరిన ముకుందరావు ఇల్లంతా చీకటిమయంగా ఉండడంతో ఆశ్చర్యపోతూ లైట్లు వేశాడు.

'తలుపులు బార్లా తెరిచి లైట్లు వేసుకోకుండా గిరిజ ఏం చేస్తున్నట్టు?' అన్ని గదుల్లోకి తొంగిచూస్తూ పడకగదిలోకి వచ్చాడు.గిరిజ మంచం మీద పడుకుని ఉంది, రెండు చేతులూ కళ్ళ మీద వేసుకుని.

ఆ సమయంలో గిరిజ - ఉంటే వంటగదిలో లేదా బాల్కనీలో ఉండాలి.

"ఒంట్లో బాగుండలేదా?" గిరిజ రెండు చేతుల్నీ కళ్ళమీద నుంచి తొలగిస్తూ అడిగాడు.

గిరిజొక్క ఉదుటునలేచి ముకుందరావుని గట్టిగా పట్టుకుని ఏడవడం మొదలుపెట్టింది.

ముకుందరావు పూర్తిగా భయపడిపోయాడు.

"ఏంటి? ఏమయింది? చెప్పు. చెప్పకుండా అట్లా ఏడిస్తే నేనేం చెయ్యను?" కంగారు పడుతూనే ఆమెను తననుంచి వదిలించి మంచం మీద కూచోబెట్టాడు.

"క్రాంతి నెలరోజుల్నించీ కాలేజికి వెళ్ళటం లేదట."

వెక్కిళ్ళ మధ్యలోంచి ఎలాగో ఆ నాలుగు ముక్కలూ చెప్పి మళ్ళీ చెంగునోట్లో కుక్కుకుంది.

ఇంకేదో పెద్ద ప్రమాదాన్ని శంకించిన ముకుందరావు మనసు కాస్త తేలికపడింది.

"నీవన్నీ పిచ్చి అనుమానాలు. కాలేజికి వెళ్ళక ఎక్కడికి వెళ్తుంది? అసలెవరు చెప్పారు?"

గిరిజను అనునయిస్తూ,కళ్ళనీళ్ళు తుడుస్తూ దగ్గరకు తీసుకున్నాడు.

"క్రాంతి క్లాసేనట - మానస అని. ఆ అమ్మాయి వచ్చి చెప్పిందివాళ. నెలరోజుల్నించీ కాలేజికి రావడం లేదంటే సీరియస్‌గా అనారోగ్యంతో బాధ పడుతూందేమోనని చూసిపోదామని వచ్చిందట. ఆ పిల్ల ఈ కబురు చెప్పేసరికి నాకు కాళ్ళూ చేతులూ ఆడలేదు. సరే మన పిల్ల మనకు తెలియకుండా ఈ పిచ్చివేషాలు వేస్తోందని ఆ పిల్లకెట్లా చెప్పను? ఆ అమ్మాయికి అనుమానం రాకుండా ఏదో సర్దిచెప్పిపంపాను. అసలిదెందుకు ఇట్లా చేస్తోంది? ఏం తక్కువయిందని? ఏంకావాలని? ఏం ఇవ్వలేదని?"

గిరిజ మళ్ళీ మొదటి స్థితికి వచ్చింది.

ముకుందరావు మటుకు ఏం చెబుతాడు? అతనికీ అయోమయంగానే ఉంది. కానీ, గిరిజకు ధైర్యం చెప్పక తప్పదు.

"కనుక్కుందాంలే - కంగారుపడకు. అసలు అమ్మాయిని రానివ్వు."

"అది పూర్తిగా పాడైపోయింది. తెలివిగలది, తెలివిగలది అనుకున్నాం. అన్ని తెలివితేటలూ గంగలో కలిపి ఇష్టమొచ్చినట్లు తిరుగుతోంది. అదేమంటే మనల్ని నోరెత్తనివ్వకుండా మాట్లాడ్డం నేర్చింది."

గిరిజ కోపంలోంచి మాట్లాడుతూందని అనిపించినా, ముకుందరావుకి కూడా ఈ విషయం సీరియస్‌గానే అనిపించింది.ఇవాళ క్రాంతితో ఏదో ఒకటి తేల్చెయ్యాలి అనుకున్నాడు. అదేమాట గిరిజతో అన్నాడు.

"ఇవాళ సీరియస్‌గా మాట్లాడదాంలే."

గిరజకు ఈ మాట్లాడడాల మీద నమ్మకం ఏనాడో పోయింది.

"ఏం మాట్లాడతాం? దాని సమాధానాలు విని తల తిరిగిపోతోంది. ఇంటర్‌లో ఎనభై ఎనిమిది శాతం మార్కులు తెచ్చుకుని ఎం. సెట్ రాయనంది. సరేలే అన్నాం. సోషియాలజీ చదువుతానంది. దాని తెలివికి అదేం సబ్జక్టనుకున్నా, సివిల్ సర్వీసెస్ రాయించొచ్చులే అనుకున్నాం. ఆ మాట నేరకపోయి పైకి అన్నాను. అంతే - నేను చస్తే ఆ పరీక్షలు రాయను, ఉద్యోగం చెయ్యను అంది. సరే ఏదో ఒకటి చదివి దాని బతుకు అది బతుకుతుంది, ఉన్న

ఒక్క ఆడపిల్లకు పెళ్ళి చెయ్యగల స్తోమత లేదా మనకి అని ఊరుకున్నాం. దీని వరస చూస్తుంటే - ఇది - ఇది - పెళ్ళి చేసుకుంటుందీ? దీని కోసం మగపిల్లలు రావణదాడిగా రావడమేనాయె . పెళ్ళా పెటాకులా - అదంతా తర్వాత సంగతి. ఇప్పుడు కాలేజికి వెళ్లకుండా - ఆ సంగతి మనకు చెప్పకుండా ఎక్కడ ఏ నాటక మాడుతున్నట్టు? ఏం చేస్తున్నట్టు?" గిరజకు ఏడుపు ఆగడం లేదు. ముకుందరావుకి గిరజను చూస్తుంటే విపరీతంగా జాలి వేసింది.

"ఊరుకో - నువ్వన్నీ విపరీతంగా ఊహిస్తావు. ఏదో చిన్నతనం. మాట్లాడదాంగా. లే - నేను స్నానం చేసి వస్తా."

ముకుందరావు స్నానానికి వెళ్ళాడు. గిరజకూడా లేచి ముఖం కడుక్కుని, కుక్కర్‌లో బియ్యం పడేసి వచ్చి కూచుంది.

ఎంతసేపటికీ క్రాంతి రాలేదు. రాత్రి ఎనిమిదిన్నర అవుతుండగా నిశ్శబ్దాన్ని మళ్ళీ ముకుందరావే భగ్నం చేశాడు.

ముకుందరావుకి ఆకలిగా ఉంది. అతను ఆకలికి ఆగలేడు.

"అన్నం తిందామా" అనడిగాడు భయపడుతూనే.

పిల్ల గురించి ఆందోళనలేకుండా తిండి గురించి ఆలోచిస్తున్నావని గిరిజ అనగలదు. ఎందుకోగాని గిరిజ అంత మాట అనలేదు.

"నువ్వు తిను. నేను దానితో తాడో పేడో తేల్చుకుని గాని తినను. అదెట్లా ఆడిస్తే అట్లా ఆడుతున్నాం. ఏది కావాలంటే అదిచ్చాం. మన మీద కక్షగట్టినట్లు ఇట్లా చేస్తుందేమిటి?"

గిరిజ కోపం ఒక్క డిగ్రీ కూడా తగ్గలేదని అర్థమయింది. గిరజనలా ఒదిలి తానొక్కడూ ఎట్లా భోంచేస్తాడు? ఏదో పుస్తకం తిరగేస్తూ కూచున్నాడు. గిరిజ చాలా అసహనంగా పేపరు తిరగేస్తోంది.

ఎంతో చక్కగా, అందంగా అలంకరించబడిన ఆ డ్రాయింగ్ రూంలో అతి అసహజమైన వాతావరణాన్ని బలవంతంగా నింపినట్లుంది.

చివరకు తొమ్మిది దాటుతుండగా క్రాంతి వచ్చింది. రంగు వెలిసినట్టు, మట్టికొట్టు కున్నట్టు ఉన్న జీన్ ప్యాంటూ, దానిమీద మురికిగా ఉన్న టీ షర్టు - చిందరవందరగా ఉన్న తల.

ఆ పిల్లను చూస్తూనే గిరిజకు ఒళ్లు మండుకొచ్చింది.

"ఎక్కడ తిరిగొస్తున్నావ్?" పళ్ళు నూరుతున్నట్టే అడిగింది.

క్రాంతి చిరునవ్వుతో బ్యాగ్ అల్మరాలో పెడుతూ, "నీకు బొత్తిగా అనవసరమైన ప్రశ్నలు ఎందుకడుగుతావమ్మా?" అంది.

"అనవసరమా? అర్థరాత్రిదాకా నువ్వు ఎక్కడెక్కడో తిరిగి వస్తుంటే, అది మాకు అనవసరమా?" నిప్పులే కక్కింది గిరిజ.

"పూర్తిగా అనవసరం. నీకు శాంతిగా బతకడం రాదమ్మా." తల్లి కక్కిన నిప్పులను తొక్కడం కాదు గదా చూడనైనా చూడకుండా తన గదిలోకి వెళ్ళిపోయింది.

"చూశావా దాని వేషం?" తన కోపం ఎందుకూ పనికిరాలేదనే ఉక్రోషం గిరిజ గొంతులో.

"నువ్వూరుకో - నే మాట్లాడతాగా." ముకుందరావు పుస్తకం పక్కనపెట్టి యుద్ధానికి సిద్ధపడే సిపాయిలా తనను తాను ఎలర్ట్ చేసుకుని వచ్చి కుర్చీలో కూచున్నాడు.

క్రాంతి నైటీ వేసుకుని వచ్చింది.

"అన్నం తిన్నారా? నాతో తింటారా?"

క్రాంతి ఆ మాట అడిగిన తీరుకి ముకుందరావు ధైర్యం జారిపోయింది. క్రాంతిని కేకలెయ్యడం తన వల్ల కాదు. దానివల్ల ప్రయోజనమూ ఉండదు. ఆ ఆత్మజ్ఞానంతో ప్రేమగానే మాట్లాడదామని నిర్ణయించుకున్నాడు.

"కాలేజికి ఎందుకెళ్లటం లేదురా?" ప్రేమ ఉట్టిపడేలా అడిగాడు. అతని తీరుకి గిరిజకు ఒళ్లు మండుతోంది.

"బోర్ కొడుతోంది నాన్నా - క్లాసులు సరిగా జరగవు. జరిగే క్లాసుల్లో ఆ లెక్చరర్లు చెప్పేది ఏమీ ఉండదు. వాళ్లకంటే అన్ని సబ్జక్టులూ నాకే బాగా వచ్చు." క్రాంతి కూడా శాంతంగానే చెప్పింది.

"నీకంత అహంకారం పనికిరాదు." విసురుగా అంది గిరిజ.

"నీకంత కోపం పనికిరాదు" అంతకంటే విసురుగా అంది క్రాంతి.

ముకుందరావు వాళ్ళిద్దరి మధ్యలోకి సానునయ ధోరణిలో వచ్చాడు.

"ఆ సంగతి మాకు చెప్పొచ్చుగదమ్మా."

"చెప్తే ఏం చేస్తారు? నాకు చెప్పాలనిపించలేదు. చెప్పలేదు. ఇప్పుడేమయింది?" క్రాంతి వీళ్ళ ఆందోళనకు ఆశ్చర్యపడుతోంది.

"వాళ్ళు పాఠాలు సరిగా చెప్పడం లేదు సరే - అటెండెన్సు కావాలిగా. లేకపోతే పరీక్షలకు కూచోనివ్వరు గదా."

"పరీక్షలకు ఎవరు కూచుంటున్నారు?"

గిరిజ, ముకుందరావులు పిడుగుపడ్డట్టు కూచుండిపోయారు.

తన వంకే చూస్తున్న తలిదండ్రులను చూసి చిరాకేసింది క్రాంతికి.

"ఏంటలా చూస్తారు? నేను పరీక్షలకు వెళ్ళను.చదువు మానేశాను." దానికి తిరుగు లేదన్నట్లు చెప్పింది.

గిరిజ సన్నగా ఏడవడం మొదలుపెట్టింది.

"మరి ఏం చేస్తావమ్మా?" విసుగొచ్చింది ముకుందరావు గొంతులో కూడా.

"ఆలోచిస్తున్నా నాన్నా - సీరియస్‌గా వెదుకుతున్నా. నాకు తెలియగానే మీకు చెప్తా." సిన్సియర్‌గా చెప్పింది.

"మాకు ఇప్పుడే చెబితే మేం కూడా నీ వెతుకులాటలో సహాయపడతాం కదా." ఎంతో కన్సర్న్‌తో అడిగాడు.

ఆ కన్సర్న్‌లో తానెక్కడ కరుగుతానో అన్న సందేహం వచ్చినట్లు వెంటనే అవసరమైనదానికన్నా ఎక్కువ కఠినత్వం తెచ్చిపెట్టుకుని, "నాకు మీ సహాయం వద్దు నాన్నా - నా సంగతి నేనే చూసుకుంటా" అంది క్రాంతి.

ముకుందరావు హతాశుడయ్యాడు.

గిరిజ ఇక ఊరుకోలేకపోయింది.

"ఏమిటే నీ సంగతి నువ్వు చూసుకునేది? కని పెంచాం. ఇప్పుడు కూడా మా తిండి తింటున్నావు. మాతో ఏ సంబంధమూ లేనట్లు మాట్లాడతావేంటి?"

క్రాంతి సమాధానం చెప్పలేదు.

"చెప్పు - మాట్లాడవేం?" రెట్టించింది గిరిజ.

"నేను మాట్లాడితే నీకు కోపం వస్తుంది. ఏడుస్తావు. నన్నర్థం చేసుకోవటం మీ వల్ల కాదు." నిస్సహాయంగా అంది క్రాంతి.

"ఏంటి నిన్నర్థం చేసుకునేది? చదువుకోవు. ఇంటిపట్టున ఉండవు. పెళ్ళి చేసుకోవు. ఏమర్థం చేసుకోవాలి నిన్ను? ఫలానా చదువు చదువుకుంటాను అంటే అర్థం చేసుకుంటాం. ఇక నాకు చదువు వద్దు పెళ్ళి చెయ్యండి అంటే అర్థం చేసుకుంటాం. ఫలానా అబ్బాయిని ప్రేమించాను అంటే అర్థం చేసుకుంటాం. పోనీ ఫలానా సంఘంలోనో, పార్టీలోనో పనిచేస్తానూ అంటే అర్థం చేసుకుంటాం.

ఏదీ లేకుండా - ఓ పద్ధతీ పాడూ లేకుండా..." రుద్ధమైన కంఠం గిరిజనింక మాట్లాడనివ్వలేదు.

"చదువూ ఉద్యోగం, పెళ్ళి పార్టీ లేదా సంఘం - ఈ మూడూ కాకుండా ఉండే జీవితం కోసం వెతుకుతున్నానమ్మా. ఈ మూడూ, ఇంకా ఇట్లాంటివి కొన్ని సిస్టమ్స్, కొన్ని పద్ధతులు, విధానాలు, వ్యవస్థలు ఉన్నాయి. నేనా వ్యవస్థలకి లొంగదల్చుకోలేదు. అన్నిటికీ బయటే ఉండదల్చుకున్నాను. వీటన్నిటినీ వ్యతిరేకించి, వీటికి వెలుపల నా ఉనికిని నేను ఎట్లా నిరూపించుకోవాలో నాకూ అర్థం కావడం లేదు. ఆ స్ట్రగుల్‌లో ఉన్నా నేను. నాకు మీరు సహాయపడొద్దు. కనీసం అడ్డురాకండి. నాదారిన నన్ను పోనివ్వండి."

క్రాంతి వెళ్లి డైనింగ్ టేబుల్ దగ్గర కూచుని ప్లేట్‌లో అన్నం పెట్టుకుంటోంది.

"రా - మనం కూడా తిందాం" అన్నాడు గిరిజతో ముకుందరావు.

"నువ్వు తిను." గిరిజ మొండికెత్తినట్లు కూచుంది.

ముకుందరావుకి కూతురి మాటలు సగం అర్థమయ్యాయి. సగం అర్థంకాలేదు. కూతురు సామాన్యురాలు కాదని తెలుసతనికి. ఇప్పుడు కాదు గదా ఎప్పుడూ క్రాంతితో వాదించి నెగ్గలేమని అతనికి రూఢి. అసలిలాంటి విషయాలు వాదనల్తో, మాటల్తో తేలేవి కావు. గిరిజకు ఆ సంగతి అర్థంకాదు.

ముకుందరావు తానూ నెమ్మదిగా డైనింగ్ టేబుల్ దగ్గరకు చేరాడు.

"అమ్మ అన్నం తిననంటోందిరా." క్రాంతి మనసులో జాలి పుట్టించాలనే విఫలయత్నం చేశాడు.

"అది ఆవిడ ఇష్టం" నిర్లక్ష్యంగా అంది క్రాంతి.

"అమ్మను ఎందుకట్లా ఇబ్బంది పెడతావు?"

కోపాన్ని కంట్రోల్ చేసుకోవడం ముకుందరావు వల్ల కూడా కావడంలేదు. కానీ, క్రాంతి చాలా నెమ్మదిగా, స్పష్టంగా చెప్పింది.

"ఇబ్బంది పెట్టడం అనేది ఉంటుందనుకోను నాన్నా - ఇబ్బంది పడదల్చుకున్నవాళ్ళు పడతారు. అంతే"అన్నం తినేసి తన గదిలోకి వెళ్ళిపోయింది క్రాంతి.

☆☆☆

గిరిజ తాను నిద్రపోలేదు, ముకుందరావుని నిద్ర పోనివ్వదల్చుకోలేదు. గిరిజ, ముకుందరావులది ప్రేమవివాహం అని చెప్పాలి. ఇద్దరికీ కాలేజీ రోజుల నుంచీ పరిచయం ఉంది. వాళ్ళు యూనివర్సిటీకి వెళ్ళేసరికి దేశ పరిస్థితి అల్లకల్లోలంగా ఉంది. ఇద్దరూ తీవ్రవాద విద్యార్థి ఉద్యమాల్లో భాగమయ్యారు. ఇంతలో ఎమర్జెన్సీ విధించారు. దాంతో ఉద్యమంలోనూ, వాళ్ళ జీవితంలోనూ కూడా అనుకోని మార్పులు వచ్చాయి.ముకుందరావు రహస్య జీవితానికి వెళ్ళాడు. గిరిజ అట్లా రహస్య జీవితానికి వెళ్ళలేదుగానీ, చదువు మాని సంఘం పనుల్లో మునిగిపోవాల్సి వచ్చింది.చదువు మానడం, పూర్తిగా సంఘం పనులు చేయడం ముకుందరావుకి కుదిరినంత తేలికగా గిరిజకు కుదరలేదు. ఇంట్లో తలిదండ్రులు, బంధువులు గొడవ చేశారు. గిరిజా తన పట్టు విడవలేదు. పార్టీ పెద్దలు ఇరుపక్షాలకీ నచ్చే మధ్యేమార్గం చూపించారు. గిరిజ, ముకుందరావుని పెళ్ళి చేసుకుంటుంది. పెళ్ళి చేసుకున్నాక భర్త ఎట్లా చెబితే అట్లా చేస్తుంది. కాదనే హక్కు తలిదండ్రులకూ, బంధువులకూ ఎవరికీ ఉండదు. గిరిజ తలిదండ్రులు దీనికి అంగీకరించారు. అంగీకరించక తప్పదు. పిల్లా మాట వినేలా లేదు. గుడ్డిలో మెల్ల ముకుందరావుది తమ కులమే. పిల్లకు పెళ్ళి చేస్తే తమ బాధ్యత తీరిపోతుంది. హడావుడిగా

పెళ్ళి జరిపించేశారు. పెళ్ళయిన వారం రోజులకే ముకుందరావు రహస్య జీవితానికి వెళ్ళిపోయాడు. ఎమర్జెన్సీ ఉన్న రెండున్నర ఏళ్ళ లోనూ వాళ్ళు పది, పదిహేను రోజులు కూడా కలిసి ఉండలేదు. అయినా, గిరిజ తల్లయింది. క్రాంతి పుట్టింది. క్రాంతిని తల్లిదండ్రుల దగ్గర వదిలి గిరిజ తన పనుల్లో మునిగిపోయింది. ఎమర్జెన్సీ ఎత్తేశారు. జనతా పార్టీ ప్రభుత్వం వచ్చింది. కానీ, ముకుందరావు రహస్య జీవితం కొనసాగించాడు. పార్టీ అవసరాలు అలాంటివి. గిరిజ పరిస్థితిలో కొంత మార్పు వచ్చింది. క్రాంతిని స్కూల్లో చేర్చాలి. ఒకచోట కొంత స్థిరమైన జీవితం కావాల్సివచ్చింది. హైదరాబాద్ వచ్చి ఒక ప్రైవేట్ స్కూల్లో టీచరుగా పనిచేస్తూ, పార్టీ పనులు కూడా చేయడం మొదలుపెట్టింది. అయిదారేళ్ళు అట్లా గడిచిపోయాయి. ముకుందరావుకి పార్టీతో విభేదాలొచ్చాయి. ఇక పార్టీలో పనిచేయలేననుకున్నాడు. ఆ రోజుల్లో ఇద్దరూ విపరీతంగా ఘర్షణ పడ్డారు - ఏం చెయ్యాలి, ఎలా బతకాలి అని.

పార్టీలోంచి, రహస్య జీవితం నుంచీ బయటికి రావడం, ఆ కేసుల్లో బెయిలు తీసుకోవడం, కోర్టులకు హాజరవ్వడం - వీటితో పాటు మధ్యలో ఆపిన ఎం.ఏ కూడా పూర్తి చేయడంతో ఒక సంవత్సరం గడిచిపోయింది. గిరిజ తల్లిదండ్రులు ఈ సమయంలో వాళ్ళనెంతో ఆదుకున్నారు. ముకుందరావు కూడా ఒక జూనియర్ కాలేజీలో లెక్చరర్‌గా చేరి 'లా' చదవడం మొదలుపెట్టాడు. అప్పటికి క్రాంతికి పదేళ్లు. క్రాంతిని మంచి రెసిడెన్షియల్ స్కూల్లో చేర్చారు. ముకుందరావు హైదరాబాద్‌లో లాయర్‌గా పేరూ, డబ్బూ సంపాదించడం మొదలుపెట్టి జీవితంలో స్థిరపడేసరికి క్రాంతి ఇంటర్‌లోకి వచ్చింది. గిరిజ ఉద్యోగం మానేసింది. సొంత ఇల్లు కట్టుకున్నారు. అనేక ఆటుపోట్ల తర్వాత ఎలాగో స్థిరపడగలిగామని సంతృప్తిపడ్డారు భార్యాభర్తలు.

క్రాంతి ఇంటర్‌లోకి వచ్చేంతవరకూ వాళ్ళకే సమస్యా లేదు. అప్పుడే వాళ్ళు సొంత ఇంట్లోకి మారారు. అప్పటిదాకా వాళ్ళింట్లో డ్రాయింగ్ రూంలో రోజూ ఏదో ఒక రిఫరెన్సు కోసమో, మరోదానికోసమో ఉంటున్న మార్క్స్ ఏంగెల్స్ రచనలు లోపలి గదుల్లోకి వెళ్లిపోయాయి.

డ్రాయింగ్ రూం చర్చల్లో ముకుందరావూ, గిరిజా తమ స్నేహితులతో సోవియట్ యూనియన్ పతనం,తూర్పు యూరప్ దేశాల్లో మార్పులు - వీటి గురించి తీవ్రంగా వాదోపవాదాలు జరిపేవారు.

సోవియట్ విప్లవం, చైనా విప్లవాల్లో జరిగిన తప్పుల్ని చీల్చి చెండాడేవారు.

ఇప్పుడు దేశంలో ఉన్న విప్లవ పార్టీలనూ, వామపక్ష రాజకీయాలనూ తూర్పారబట్టేవారు.

దేశానికి భవిష్యత్తు లేదని తీర్మానించేవారు.

తమ భవిష్యత్తూ, పిల్లల భవిష్యత్తూ గురించి ఆలోచించేవారు.

ముకుందరావు, గిరిజలైతే క్రాంతిని డాక్టర్ చదివించడమే తమ జీవితాశయం చేసుకున్నారు.

'క్రాంతి తెలివైంది. తప్పకుండా మెడిసిన్‌లో సీటు సంపాదిస్తుంది. ఒకవేళ సంపాదించలేకపోతే డొనేషన్ కడతారు. తమకు మాత్రం క్రాంతి తప్ప ఎవరున్నారు? క్రాంతి డాక్టరవుతుంది. ఇంకో డాక్టర్ని పెళ్ళాడుతుంది. వీలైతే ఇద్దరూ అమెరికా వెళ్తారు. తమ అమ్మాయిని చూడడానికి తామూ వెళ్తారు.'

ఇట్లాంటి కలలేవో కంటుండేవారు. ఆ కలలు పూర్తిగా నిరాధారమైనవి కావు. తమలాగే గతంలో తీవ్రవాద ఉద్యమంలో, వామపక్ష పార్టీల్లో పని చేసిన వారి పిల్లలు చాలామంది అమెరికా వెళ్ళారు. కృష్ణా, గుంటూరు జిల్లాల్లో తమ కులానికి చెందిన కమ్యూనిస్టు నాయకుల పిల్లలు చాలామంది విదేశాల్లో ఉన్నారు. స్వదేశంలో ఉన్నవారు కూడా డాక్టర్లుగా, ఇంజనీర్లుగా, పారిశ్రామికవేత్తలుగా స్థిరపడ్డారు. ఒకప్పుడు తమ యౌవనంలో ఆ నాయకుల మీద తిరుగుబాటు చేసి మరింత రాడికల్ పార్టీలలోకి వెళ్ళిన గిరిజా ముకుందరావులు ప్రస్తుతం వాళ్ళ దిక్కే చూస్తున్నారు. అయితే, అలా చూస్తున్నామని వాళ్ళకు తెలియదు. మాటల్లో వాళ్ల రాజకీయాలను విమర్శిస్తూనే ఉన్నారు. కానీ తమకే తెలియకుండా వారి జీవిత విధానాన్ని మాత్రం అనుకరిస్తున్నారు.

క్రాంతి ఇంటర్ పాసవుతూనే వీళ్ళ కలలను చెరిపేసింది. ఎనభై ఎనిమిది శాతం మార్కులు సంపాదించుకున్న పిల్ల ఎం.సెట్ పరీక్షలే రాయనన్నది. తోటి పిల్లలందరూ రాత్రింబగళ్ళు పరీక్షల కోసం చదువుతుంటే, క్రాంతి ఇంట్లో అటకెక్కిన పుస్తకాలు దించీ, లైబ్రరీ పుస్తకాలు తెచ్చుకునీ చదవడం మొదలుపెట్టింది. గిరిజ అప్పుడే మొత్తుకుంది - ముకుందరావు పెద్దగా పట్టించుకోలేదుగానీ.

"పద్దెనిమిదేళ్ళ వయసు దానికి - మార్క్వెజ్ పుస్తకాలూ, మిలన్ కుందేరా పుస్తకాలూ ఎందుకు? ఏ రంగనాయకమ్మ నవలలో చదవకుండా ఈ పిచ్చేమిటి? నాకు భయంగా ఉంది" అంటూనే ఉంది.

నువ్వు చలం పుస్తకాలు చదివితే మీ నాన్నా అమ్మా ఇలాగే బాధపడలేదూ? ఇదీ అంతే. ఆ పుస్తకాలు చదివి నువ్వు పాడయ్యావా? నువ్వు అతిగా ఆలోచించకు" అనేవాడతను. కానీ, క్రాంతి చలం పుస్తకాలు చదువుతుంటే కూడా గిరిజ గుండె దడదడలాడేది.

'ఇంకొక్క రెండేళ్ళాగి చదవొచ్చుగా' అనుకునేది.

క్రాంతి దృష్టిలో తానొక తెలివితక్కువ తల్లినని గిరిజకు అతి త్వరలోనే స్పష్టమయింది. తాను ఎక్కడికి వెళ్ళేదీ చెప్పదు. ఎప్పుడు వచ్చేదీ చెప్పదు. ఇంట్లో గడిపే సమయం రోజు రోజుకీ తగ్గిపోతూంది.

"ఎప్పుడూ స్నేహితులంటూ తిరుగుతావు. ఒక్కదాన్నీ ఇంట్లో బోరు కొట్టి చస్తున్నా. ఇంటిపట్టున ఉండరాదూ" అనేది గిరిజ.

"ఈ ఇంట్లో బోర్ - ఏముందిక్కడ?"

"మేము లేమా?"

"మీరు మరీ పెద్ద బోర్."

క్రాంతి నిర్దాక్షిణ్యతకు గిరిజ మనసు విలవిలలాడేది. ఎట్లాగో బి. ఏ, ఎం. ఏ చదివి ఏ రిసెర్చో చేస్తుంది అనుకుంటే, అప్పటికి వివేకం వస్తుందనుకుంటే క్రాంతి పూర్తిగా చదువే మానేస్తాననటుంది.

గిరిజ దుఃఖం ఎట్లా ఆపాలో తెలియక ముకుందరావు విసుక్కునే స్థితికి వచ్చాడు.

"ఏమయింది చదువు మానేస్తే - నువ్వు మానెయ్యలా ఎం. ఏ. చదువుతూ - "

"నేనంటే పార్టీ కోసం, ఉద్యమం కోసం మానేశాను. ఆ ఎమర్జెన్సీ పెట్టకపోతే నా ఎం. ఏ పూర్తయ్యేదే."

"దానికిప్పుడు మరి ఏ పార్టీ లేదు పని చేయటానికి - చదవ బుద్ధి కావటం లేదేమో -"

"అసలు మీరే దానికిలా అలుసిచ్చారు" గిరిజకు తప్పంతా ముకుందరావుదే అనుకుంటే కాస్త శాంతి.

"చూడు గిరిజా - కాలం మారింది. మనం ఆ వయసులో ఎలా ఉన్నాం? ఆలోచించు."

గిరిజకిక కోపం, ఉక్రోషం తన్నుకొచ్చేశాయి..

"ఎలా ఉన్నాం ఆలోచించు. నేనెక్కడికి వెళ్ళినా మా అమ్మా నాన్నలకు చెప్పే వెళ్ళే దాన్ని. దీనిలా ఆ వికారపు వేషాలు వేసేదాన్నా? నేనేకాదు, మన విద్యార్థి యూనియన్ అమ్మాయిలంతా ఎంత డీసెంట్‌గా, హుందాగా ఉండేవాళ్లు! క్రమశిక్షణకు మారు పేరులా ఉండేవారు. చక్కగా చదువుకునే వాళ్ళు. పార్టీవాళ్ళు మానెయ్యమంటే మానేసేవారు. పెళ్ళి చేసుకోమంటే చేసుకునేవారు. మీటింగులకు వెళ్ళినా, ఊరేగింపులు చేసినా అంతా పద్ధతిగా ఉండేది. ఇప్పుడు దీని తల చూస్తే నిప్పెట్ట బుద్ధేస్తోంది. అటు బ్యూటీ పార్లర్‌కి వెళ్ళి అందంగా కత్తిరించుకోదు, ఇటు జడా వేసుకోదు. అడ్డదిడ్డంగా కత్తిరిస్తుంది. తలకు నూనె పెట్టుకోదు. కన్యాశుల్కంలో వెంకటేశం డైలాగు గుర్తొస్తుంది.

'మా అక్కే - నెత్తికి చమురాసుకోదు' అని. ఇక ఆ గుడ్డలు - పాత గుడ్డలు నయం - అదేం టేస్టో - దానికేం తక్కువని ఇట్లా ఉండాలి. నా కర్మ కాకపోతే-

నాకూ దానికీ పోటీనా? మా అమ్మానాన్నలతో ఎంత ప్రేమగా ఉండేదాన్ని? ఎంత మంచిగా మాట్లాడి వాళ్ళను ఒప్పించేదాన్ని! వాళ్ళకిష్టం లేకపోయినా నన్ను పార్టీ మీటింగులకు వెళ్లనిస్తున్నారని, నాకంత ఇష్టం లేకపోయినా వాళ్ళ సంతోషం కోసం ఎన్ని పనులు చేసేదాన్ని? నువ్వు మాత్రం? మీ అమ్మా నాన్నల్ని ఇట్లా కష్టపెట్టావా? వాళ్ళతో ఎన్నడైనా ఇంత తిరస్కారంగా మాట్లాడావా?" ఆయాస మొచ్చి ఆగిందిగానీ, గిరిజ ఆవేశం మాత్రం తగ్గలేదు.

ముకుందరావుకి ఏం చెప్పాలో తెలియలేదు. అన్నీ నిజమే - తాము తిరుగుబాటు చెయ్యలేదని కాదు. కానీ, దానికో పద్ధతి ఉంది. క్రాంతికి ఆ పద్ధతి ఉన్నట్లు కనపడడంలేదు. ఆ రాత్రి ఇద్దరూ జాగారం చేశారు.

☆☆☆

మర్నాడు క్రాంతి ఇంట్లోనే ఉంది. గిరిజ పనిలో సాయం అడిగితే చేసింది. సాయంత్రానికి ముకుందరావు వచ్చేసరికి ఇద్దరూ కాస్త సామరస్యంగా మాట్లాడుకుంటున్నారు. ముకుందరావు కూడా వాళ్ళతో చేరాడు.

ఇంతలో క్రాంతి కోసం ఎవరో అబ్బాయి వచ్చాడు.

క్రాంతి అతన్ని తీసుకుని తన గదిలోకి వెళ్ళింది. అక్కడ పెద్ద వాల్యూంలో ట్రేసీ చాప్‌మన్ క్యాసెట్ పెట్టారు.

"ఈ అబ్బాయి క్రాంతి కోసం చాలాసార్లు వస్తున్నాడు. నువ్వు అతన్ని కూచోబెట్టి వివరాలవీ కనుక్కో" అంది గిరిజ.

ఒకరెండు గంటలు గడిచాక ఆ అబ్బాయి వెళ్తుంటే ముకుందరావు ఆపి పలకరించాడు.

"నీ పేరేంటి బాబూ?"

ఆ అబ్బాయి ముకుందరావు వంక తమాషాగా చూసి నవ్వి -

"సంతోష్" అని సమాధానం చెప్పాడు.

"ఇంతసేపూ క్రాంతితో మాట్లాడావు - కాసేపు మాతో కూడా మాట్లాడు. దా - కూచో" అని కూర్చోబెట్టాడు.

"ఏం చదువుతున్నావు?"

"బి.ఏ. - ఫైనల్" సంతోష్‌కి అట్లా కూర్చోటం చాలా ఇబ్బందిగా ఉందని అతని ముఖం చూస్తేనే తెలిసిపోతోంది.

'పోన్లే ఈ పిల్లాడు చదువు మానెయ్యలేదు' అనుకున్నాడు ముకుందరావు.

"మా క్రాంతి చదువు మానేసింది" అన్నాడు.

"మంచిపని చేసింది. ఈ చదువులు ఒట్టిబోర్ అండ్ బోగస్. నాకూ మానెయ్యాలనే ఉంది"

గిరిజ మధ్యలోనే జోక్యం కలిగించుకుంది.

"నువ్వంటే మగపిల్లాడివి. ఏం చేసినా ఫరవాలేదు. మా క్రాంతి ఆడపిల్ల-"

సంతోష్ నవ్వాడు.

"అంటే మగపిల్లాడిగా ఉండడం బాగుంటుందనుకున్నారా? ఐ హేట్ ఇట్. నేను స్త్రీని కాను. దళితుడ్ని కాను. ఐ యామ్ గిల్టీ ఆఫ్ మై బీయింగ్. ఏ ఛాలెంజ్ లేదు నా లైఫ్‌లో. క్రాంతి అమ్మాయి. కనీసం కొన్ని బయటి విషయాల్లోనైనా రెబెల్ అయి తన ఉనికిని నిరూపించు కుంటుంది. నేను - నేను నా మీదే రెబెల్ అవాలి. అదెంత కష్టమో మీకు తెలియదు. అర్థం కాదు."

ముకుందరావుకి నిజంగానే అర్థంకాలేదు.

"పోనీ ఏదైనా ఉద్యమంలో చేరి పనిచెయ్యొచ్చుగా రెబెల్ అవాలని ఉంటే..." అన్నాడు.

"అది అంత తేలిక కాదు. మీరు అంతా నాశనం చేసి పెట్టారు. మాకు ఎక్కడా హోప్ అనేది కన్పించటం లేదు." ఈ విషయాలు సంతోష్‌తో మాట్లాడడం చాలా ఇబ్బందిగా అనిపించింది. మాట మార్చేశాడు.

"ఆఁ- మీ నాన్నగారు ఏం చేస్తుంటారు?"

"మీకు ఆ సమాచారం అవసరమంటారా?" సంతోష్ జవాబుకి ముకుందరావు తెల్లబోయాడు.

ఇంతలో క్రాంతి లోపల్నించి వచ్చింది.

"ఏంటి? నువ్వింకా వెళ్ళలేదా?" ఆశ్చర్యపోయింది సంతోష్‌ని చూసి.

"లేదు. మీ నాన్నగారు మానాన్నగారి వివరాలు తెలుసుకోవాలనుకున్నారనుకుంటా. కూచోమన్నారు." వ్యంగ్యంగా చెప్పాడు.

క్రాంతి తండ్రి వంక చూసి జాలిగా నవ్వింది.

"నాన్నా - సంతోష్‌ని వెళ్ళనివ్వు. వాళ్ళ నాన్నకూ నీకూ స్నేహం కుదరదు. ఆయన వివరాలు నీకు అనవసరం. సంతోష్ చాలా చిరాకు పడతాడు."

సంతోష్ లేచి క్రాంతి వంక తలూపి వెళ్ళిపోయాడు.

వివర్ణమయిన ముకుందరావు ముఖం చూసి గిరిజ సహించలేకపోయింది.

"ఏంటే ఇది? మమ్మల్ని ఎందుకిట్లా అవమానిస్తావు? నీ స్నేహితుడి వివరాలు మేం తెలుసుకోగూడదా?"

"ఎందుకూ తెలుసుకోవటం? మీరు వివరాలతో మనుషుల్ని తూస్తూ ఉంటే. చాలా రోజుల్నించి చూస్తూనే ఉన్నాను. నా స్నేహితుల్ని నేనలా తూచనివ్వను. నా స్నేహితులు అందుకు ఒప్పుకోరు."

"తూచటం ఏంటమ్మా?" ముకుందరావు నీరసంగా అడిగాడు.

"ఈ డ్రాయింగ్ రూంలో నిత్యం జరిగే పని అదే. మనుషుల్ని తూస్తారు. ఉద్యోగం, చదువు, జీతం, హోదా, కులం, మతం వాటిని బట్టి వాళ్ళని ఇంట్లోకి ఎందాకా రానివ్వచ్చో నిర్ణయిస్తారు."

"మేము కులం, మతం చూస్తామా?"

ఇద్దరూ నిర్ఘాంతపోయారు. ఆ దారుణమైన మాటకు తట్టుకోలేక ఒకర్నొకరు 'ఎంత అన్యాయం' అన్నట్లు చూసుకున్నారు.

"చూస్తారు. అందుకు సందేహమా? లేకపోతే మీ స్నేహితుల్లో మీ కులం కాని వాళ్ళు ఒక్కళ్ళున్నారా? ఒక్కళ్ళ పేరు చెప్పండి. మీ పరిచయస్థుల సంగతి కాదు నేనడిగేది. మీ పడక గదిలోకీ, వంటగదిలోకీ రాగలిగిన మీ ప్రాణ స్నేహితుల్లో తక్కువ కులాల వాళ్ళ సంగతి సరే.- అసలు వేరే కులాల వాళ్ళున్నారా చెప్పండి? చెబితే నేను ఒప్పుకుంటాను మీకు కులం, మతం పట్టింపు లేదని."

క్రాంతి విసురుగా గదిలోకి వెళ్ళిపోయింది.

భార్యాభర్తలిద్దరూ నిరుత్తరులై చాలాసేపు ఒకరి వంక ఒకరు చూసుకోనైనా చూసుకోకుండా అలాగే కూచున్నారు.

చివరికి గిరిజే తేరుకుంది.

"ఈ పిల్లకు ఒక్క మంచి ఆలోచన రాదేంటి? అన్నీ పెడగానే ఆలోచిస్తుంది. మన స్నేహితుల్లో ఇతర కులాల వాళ్ళు లేకపోతే మనం కులం పాటిస్తున్నట్లా? ఛీ - కూతురని సహిస్తున్నాం గానీ..." పళ్ళ నూరింది కూతురి మీద.

"అదన్న మాటలోనూ కొంత నిజముందిగా." ఆలోచనగా అన్నాడు ముకుందరావు.

"ఏంటి నిజం? మీక్కూడా దాని ధోరణి వంటబడితేగాని ఇక మన బతుకు బాగుపడదు."

విసురుగా అక్కడినుంచి లేచి వెళ్ళిపోయింది.

☆☆☆

మరో నెలరోజులు గడిచిపోయాయి. క్రాంతి రోజూ ఉదయం ఎనిమిదింటికల్లా బయటికి వెళ్ళి రాత్రి తొమ్మిది, పది మధ్యలో ఇంటికి వస్తోంది. ఆ సమయంలో ఎక్కడి కెళ్తోందో తెలుసుకోవాలని గిరిజ ఆరాటం కానీ, లాభం లేదు. గిరిజ ప్రశ్నలకు క్రాంతి నవ్వేస్తుంది. ముకుందరావు అసలు అడగడానికే విముఖంగా ఉన్నాడు.

ఎప్పుడైనా బయటకు వెళ్ళని రోజులుంటే, పుస్తకాలు చదువుకుంటూ, పాటలు వింటూ ఉంటుంది క్రాంతి.

పాటలంటే క్రాంతికి చాలా ఇష్టం. ఆ అమ్మాయి ఇంట్లో ఉన్నంతసేపూ పాత హిందీ పాటలూ, బాబ్‌డిలాన్, ట్రేసీ చాప్‌మన్ వంటి వెస్టర్న్ సంగీతమూ వింటూ ఉంటుంది.

"పోనీ అమ్మాయిని సంగీతంలో చేర్పిద్దామండి"అంది గిరిజ.

"మనం చేర్పించటం! నువ్వింకా తల్లిపాత్రలోనే ఉన్నావా? మనం చెప్పటం, అమ్మాయి వినటం - ఏ లోకంలో ఉన్నావు?" విసుక్కున్నాడు ముకుందరావు.

"పోనీ అడుగుదాం. మంచిమూడ్‌లో ఉంటే వింటుందేమో. ఏదో ఓ పనిలో పడితే కాస్త దారిలోకి వస్తుంది" అంది అనునయంగా.

ఆరోజు క్రాంతి లతా పాట 'బాసురే బజాయే కోయీ' క్యాసెట్‌కి అటూ ఇటూ కూడా అదే పాట తాను ప్రత్యేకంగా రికార్డు చేసుకున్నది పరవశంగా, ఆనందంగా వింటూ ఉండగా, ఇద్దరూ పక్కనే వచ్చి కూచున్నారు. క్యాసెట్ ఒక వైపంతా వచ్చిన అదే పాటను ఓపికగా విన్నారు. క్యాసెట్ తిప్పి మళ్ళీ అదే పాట వినబోతోంది క్రాంతి.

"పోనీ సంగీతం నేర్చుకోరాదా క్రాంతీ" అంది గిరిజ తల్లిప్రేమ ఉట్టిపడుతున్న గొంతుతో.

"నేర్చుకోను." చాలా కచ్చితంగా వచ్చింది సమాధానం.

గిరిజకు ఆ గొంతులో వినిపించని ప్రేమ, విధేయతల గురించిన అసహనంతో ముఖం వివర్ణమయింది.

ముకుందరావుకి తప్పలేదు.

"ఎందుకనమ్మా- నీకు సంగీతం చాలా ఇష్టం కదా- పాటలు వింటూ ఎంతో ఆనందం పొందుతావు. ఆ శాస్త్రం తెలిస్తే, సంగీత జ్ఞానం ఉంటే ఇంకా ఆనందం పొందవచ్చుగదా."

క్రాంతి తండ్రివంక జాలి ఉట్టిపడే కళ్ళతో చూసింది.

"జ్ఞానం వల్ల ఆనందం అంతా పాడయిపోతుందని నీకింకా తెలియలేదా నాన్నా? నాకు సంగీతం గురించి తెలియకపోవటం వల్ల హాయిగా ఆనందిస్తున్నాను. తెలిసిందనుకో- ఇక అందులో తప్పులెన్నటం మొదలెడతాను. పుడకలన్నీ అడ్డం రావటం మొదలెడతాయి. ఇప్పుడు నాకు తోచినట్టు నా మనసుకు నచ్చినట్టు పాటలు హాయిగా వింటున్నాను. ఆ ఆనందం నాకు ఒక్క సంగీతంలోనే దొరుకుతోంది. ప్రస్తుతం నేను పని గట్టుకుని సంగీతం నేర్చుకుని ఆ ఆనందాన్ని పాడుచేసుకుంటానా?"

గిరిజకు పిచ్చెక్కినంత పనయింది.

ముకుందరావు క్రాంతి వంక భయంగా చూశాడు.

'ఈ పిల్లకు ఈ వయసులో ఈ జ్ఞానం ఉండటం వల్ల ఎంత అశాంతి పడుతుందో' అనిపించేసరికి ఆయనకు కూతురిమీద ప్రేమ వెల్లువైంది.

క్రాంతి మళ్ళీ 'బాసురే బజాయే కోయీ'లోకి వెళ్ళిపోయింది.

ముకుందరావు, గిరిజలకు కూతుర్ని చూస్తుంటే జీవితం అర్థరహితంగా కనిపిస్తుంది.

ఎందుకు తామింత కష్టపడుతున్నది? క్రాంతి సుఖం కోసమే గదా! ఏ దోవల్లో క్రాంతి సుఖపడుతుందని తామనుకున్నారో, ఆ దోవల్లో ఒక్కదానికి కూడా క్రాంతి రాదని తెలిసేసరికి వాళ్ళకు తమ జీవితం క్రాంతి చుట్టూ ఎంతగా అల్లుకుందో, తమ దోవలోకి క్రాంతి రాకపోతే తమకు ఎంత అశాంతో అర్థమవసాగింది.

తమ జీవితాలకు ఇప్పుడు అర్థం ఏమిటి? ఆర్థికంగా సెటిల్ అయ్యేవరకూ అదే జీవితం అన్నట్లు గడిచిపోయింది. తర్వాత క్రాంతి తమ జీవిత లక్ష్యమనుకున్నారు. అది కాదని తేలిపోతే, ఇప్పుడిక తాము చేసే పనులకు అర్థం ఏముంది? క్రాంతి భవిష్యత్తుతో తమ భవిష్యత్తు ముడిపడి ఉందనుకుంటే క్రాంతి ఆ ముడిని తెంపేస్తోంది.

ఇద్దరి మనసుల్నీ దిగులు ఆవరించి మరి వదలనంటోంది. ఆ దిగుల్ని వదిలించుకునే ప్రయత్నాలన్నీ చేస్తూనే ఉన్నారు.

ఏదన్నా విద్యార్థి సంఘాలతోనో, మరేదన్నా ప్రజా సంఘాలతోనో పరిచయం ఉంటే, వాటిలో పనిచేస్తూ ఉంటే ఇలా మారేదికాదేమో అనుకున్నారు.

ముకుందరావు ఆ ప్రయత్నమూ చేసి చూశాడు. తన పాత పరిచయాలవల్ల ఆ పని తేలికగానే జరిగింది.

విద్యార్థి సంఘంలో పనిచేసే వాళ్ళను ఇంటికి పిలిపించి క్రాంతికి పరిచయం చేశాడు.

క్రాంతి వాళ్ళతో చాలా స్నేహంగా ఇష్టంగా మాట్లాడింది. వాళ్ళు చేస్తున్న కార్యక్రమాల గురించి, వాళ్ళ పాలసీల గురించి క్రాంతికి ఇంత బాగా తెలుసునని ముకుందరావుకి మొదటిసారి తెలిసింది. వాళ్ళు వెళ్ళిపోయాక-

"నీకు ఈ సంఘాల గురించి బాగానే తెలుసే. మరి వాటిలోకి ఎందుకు వెళ్ళలేదు." అని అడిగాడు.

"బాగా తెలుసుకాబట్టే-" నవ్వింది క్రాంతి.

"అంటే"

"అంటే, ఈ సంఘాలలో చేరితే మరో ఇరవై ఏళ్ళ తర్వాత నేనూ మీలాగే తయారవుతానని నాకుఅనిపించింది. అట్లా అవటం నాకిష్టం లేదు గనక చేరలేదు."

గిరిజ తాచుపాములా లేచింది.

"ఏం? మాకేమయింది. మేమంటే అంత చులకనేమిటి నీకు? మేం అట్లా ఆ సంఘాలలో పనిచేయబట్టే నిజంగా ఇవాళ హాయిగా ఉన్నాం. మంచీచెడ్డా తెలిసింది, ఒకపద్ధతి తెలిసింది. న్యాయం, అన్యాయం తెలిసింది. మాకేమయింది? మేం దోపిడీలు చేస్తున్నామా? ప్రజల్ని పీడించుకు తింటున్నామా? మీ నాన్న ఎన్ని కేసులు ఊరికే వాదిస్తున్నాడో తెలుసా? మనింట్లో పనిమనిషికి ఎంత జీతమో, ఎట్లా చూసుకుంటామో తెలుసా? మనిల్లు వదిలి పనిమనిషిని వెళ్ళమని చూడు - అదెట్లా విలవిలలాడిపోతుందో- ఏంటి మా దుర్మార్గం? ఎందుకు నీకా అయిష్టం?"

గిరిజ ఆవేశమంతా కక్కేశాక తీరిగ్గా, శాంతంగా అంది క్రాంతి.

"నువ్వు చెప్పే విషయాలకే నాకు అయిష్టం."

"అంటే ఏంటో చెప్పి చావు. నీ మాటలు నాకు అర్థం కావు." అరిచింది గిరిజ.

"మీరు టిపికల్ మధ్యతరగతి మనుషులు. మీరు సంఘాల్లో చేరినప్పుడు కనీసం రొమాంటిసిజమ్ అన్నా ఉందేమో. బయటికొచ్చేసరికి అదీ లేదు. చాలా తెలివైన సగటు మనుషులు మీరు. మీ ఇంట్లో పనిమనిషి చాలా ప్రేమగా సేవలు చేస్తుంది. చెయ్యక తప్పదు. తన సేవల్ని చాలా చౌకగా పొందుతున్న మీ మీద కసి రాకుండా మీరు చాలా జాగ్రత్త పడతారు. మిగిలిన వాళ్ళకంటే పది రూపాయలు ఎక్కువ పడేసి వెయ్యిరూపాయలు ఖరీదు చేసే అభిమానం, ప్రేమ కొనుక్కుందామని చూస్తారు. మీమీద వాళ్ళకు కసి కలగకుండా జాగ్రత్త పడటం మినహా, డ్రాయింగ్ రూం చర్చలు మినహా, అద్దాల బీరువాల్లో పుస్తకాలు మినహా మీకూ మిగిలిన వాళ్ళకూ తేడా లేదు. కొన్ని కేసులు ఉచితంగా వాదించి నాన్న తన అంతరాత్మకు ఎంత శాంతిని కొనుక్కుంటున్నాడు? అశాంతితో మండిపోవాల్సిన ఆత్మను ఎంత కన్వీనియంట్‌గా చల్లార్చుకుంటున్నాడు - ఎంత హాయిగా అన్నింటికి అందులవ గలుగుతున్నారు."

"కానీ, మేం ఒకప్పుడు చాలా త్యాగాలు చేశాం."

"త్యాగం. ఆ మాటంటే నాకు చాలా ఎలర్జీ కాబట్టే ఆ సంఘాల్లో నేను చేరటం లేదు. ఏదీ త్యాగం కాదు. మన కోసం, మనకు ఇష్టమైనట్లు ఉండడటం కోసం మనం చేసే పనులన్నింటికీ త్యాగం పేరు పెట్టటం దాన్ని గ్లామరైజ్ చెయ్యటం, గొప్ప చెయ్యటం, ఆ త్యాగాల భారంతో వంగటం, ఆ త్యాగాలకు ఖరీదు కట్టి, దాన్ని చివరకు రూపాయల్లోక, పెన్షన్లలోకీ మార్చటం నేర్చుకున్నారు. నాకు కంపరం ఆ మాటంటే. మీరు చెప్పే సంఘాలు ఒక వ్యవస్థ. అక్కడ కొన్ని ముందే ఏర్పరుచుకున్న భావాలుంటాయి. అధికార చట్రాలుంటాయి. వాటిని కదిలించే వీలుండదు. కొన్ని భ్రమలు, మరికొన్ని విశ్వాసాలు పోగుచేసుకుని కూర్చుంటారు. ఆ భ్రమల్నీ, విశ్వాసాల్నీ కొనసాగిస్తూ బతుకుతుంటారు. వాటిని ప్రశ్నించే అవకాశం కూడా ఉండదక్కడ. కొన్ని పడికట్టు మాటల్ని నమ్ముతూ కొంతకాలం తమ కిష్టమైన పనులు చేసి, తర్వాత మీలా మధ్యతరగతి డ్రాయింగ్ రూంలో కూచోటానికి తప్ప ఎందుకూ పనికిరావు. అది నాకు మీవల్లే ఎక్కువ తెలిసింది. మీ మర్యాదలూ, కపటత్వాలూ చిన్నప్పటి నుంచీ చూస్తూనే ఉన్నాను. ఒకరివెనకాల ఒకరు ఆడుకునే మాటల్ని వింటూనే ఉన్నాను."

గిరిజ అక్కడ్నించి ఏడుస్తూ వెళ్ళిపోయింది.

ముకుందరావుకి క్రాంతిని చూస్తే తెలియని భయంతోపాటు అంతకుముందువరకూ లేని కోపం కూడా పుట్టుకురాసాగింది.

★★★

ముకుందరావు, గిరిజ చాలా రోజుల పాటు ఈ సమస్యను తమ మనసుల్లోనే ఉంచుకుని మథనపడ్డారు. ఎవరికైనా ఏమని చెప్పుకోవాలో వాళ్ళకు అర్థంకాలేదు. 'మా అమ్మాయికి మేమంటే గౌరవంలేదు. ప్రేమలేదు. నిరసన, చులకన' అని చెప్పుకోవాలంటే వాళ్ళ మనసొప్పలేదు. గిరిజకైతే అమ్మాయి చదువు మానేసిందని చెప్పుకోవడం కూడా పరువు తక్కువగా ఉంది. 'ఇదిలా ఎందుకు తయారైంది? ఎక్కడ జరిగింది లోపం? ఎలా సరిదిద్దాలి దాన్ని' అనే సమస్యతో ఆమె తల బద్దలు కొట్టుకుంటోంది.

ఎట్లాగైనా క్రాంతిని చదువులో పెట్టాలని ఆమె ఆరాటం.

"ఈ డిగ్రీ కాలేజీల్లో ఆర్ట్స్ గ్రూపుల్లో సరిగా చదువు చెప్పరు. తెలివిగల పిల్లలకు మంచి వాతావరణం ఉండదు. అందుకే నిన్ను ప్రొఫెషనల్ కోర్సు చదవమంది. చక్కగా మెడిసిన్‌లో చేరితే ఏ సమస్యా ఉండేది కాదు" అంది ఒకరోజు.

"ఎవరికి ఏ సమస్యా ఉండనిది?" క్రాంతి అడిగింది.

"నీకే".

"నాకేం సమస్యా లేదిప్పుడు. నేను మెడిసిన్‌లో చేరకపోవటం నీ సమస్యగా చేసుకున్నావు."

"ఔను నా సమస్యే- నా కూతురు డాక్టరైతే చూడాలని ఆశపడ్డాను."

"అమెరికా వెళ్ళాలని కూడా ఆశపడ్డావు"నవ్వింది క్రాంతి.

"ఔను. ఆశపడ్డాను. అందులో తప్పేమిటి?"

"తప్పు ప్రసక్తేముంది ఇందులో? నాకు ఇష్టంలేదు. నేను డాక్టరై అమెరికా వెళ్తే నన్ను చూడటానికి నువ్వూ, నాన్నా వచ్చి ' మా అమెరికా యాత్ర' అని పుస్తకాలూ, వ్యాసాలూ రాయటం నాకు చాలా అబ్‌సీన్‌గా, వల్గర్‌గా అనిపిస్తుంది. పేపర్లలో అలాంటివి చదివి కంపరం పుట్టే ఆ చదువు మానేశాను." అంది క్రాంతి పరిహాసంగా.

"తల్లిదండ్రుల మీద నీకు కాస్తన్నా ప్రేమ లేదేమిటే?" గిరిజ ఆ పరిహాసాన్ని భరించలేకపోయింది.

"నీ కర్థం కాదుగానీ, నాకు మీమీద చాలా ప్రేమ ఉందమ్మా. మిమ్మల్ని ఇంకా దిగజారకుండా ఉంచటం కోసం నా ప్రయత్నాలు నేను చేస్తున్నా. నిజమైన ప్రేమ ఉంటే చేయాల్సింది అదేనని నా నమ్మకం."

ఇలాంటప్పుడు గిరిజకు క్రాంతిని వంగదీసి వీపుమీద బాద బుద్దేస్తుంది. ఒక్క దెబ్బ కొట్టకుండా పెంచుకొచ్చింది పిల్లను.అదే తాను చేసిన పొరపాటేమో.

గిరిజ తనలో తానే కుమిలిపోతోంది.

ముకుందరావు అలా కుమలలేక తనవంటి స్నేహితుడి దగ్గర మనసు విప్పి బాధంతా వెళ్ళగక్కాడు.

అతను ఆలోచించి ముకుందరావుని ఓదార్చే మాటలు చెప్పాడు.

"మీ అమ్మాయి మాటల్లో కొంత సెన్స్ లేకపోలేదురా. మనం ఏ వ్యవస్థపైనన్నా నిజంగా వాటి మూలాల్ని కదిలించే పోరాటం చేశామా అని అనుమానంగా ఉంది. మూలాలు కదులుతాయని పించేసరికి ఏదోరకంగా ఆ ఉద్యమాలు ఆగటానికి కూడా మన మధ్యతరగతికి ఆ మూలాల మీదున్న విశ్వాసమే కారణమేమో. అందుకే అన్ని దరిద్రాలూ అలాగే ఉన్నాయి. కులం అలాగే ఉంది. కుటుంబాలు అలాగే ఉన్నాయి. కొంచెం ఆలోచించాల్సిన విషయాలే ఇవి" అన్నాడతను.

ముకుందరావుకి ఆలోచించే ఓపిక పోయింది.

"ఏం ఆలోచనో ఏమో - మేం సొంత ఇల్లు కట్టుకోవటం కూడా మా అమ్మాయికి ఘోరమైన నేరంగా కనబడుతుంటే ఎక్కడ చావమంటావు?"

ఆ స్నేహితుడికి ముకుందరావు మీద జాలి వేసింది.

"ఒక రకమైన సంక్షోభంలో ఉందేమోలేరా. చెప్పాలంటే ఇవాల్టి యువతరం అంతా అలాంటి సంక్షోభంలోనే ఉంది. చదువుతున్న వాళ్ళకు మాత్రం ఏం చదువొస్తొందని? కాలేజీలు ఎలా ఉన్నాయో తెలియదూ? మీ అమ్మాయికి అన్నిటి మీదా రెబెల్ కావాలని ఉన్నట్లుంది. రెబెల్ అవటానికి ఇప్పటివరకూ సమాజంలో ఉన్న పద్ధతులన్నీ మొనాటనస్ సిస్టమ్స్ అయిపోయాయని ఫీలవుతున్నట్లుంది. స్ట్రగుల్ పడనియ్ - ఈ స్ట్రగుల్ అయిపోతే చాలా బాగా తయారవుతుంది. ఈ రొటీన్ బురదలోంచి భిన్నంగా ఎదుగుతుంది."

స్నేహితుడి మాటలు వింటుంటే ముకుందరావుకి కూడా కొంత ఆశ పుట్టుకొచ్చింది. తాను అనవసరంగా ఆందోళనపడుతున్నట్టనిపించింది.

'క్రాంతి తెలివైంది. ఆ పిల్లమీద నమ్మకం ఉంచాలి. ఆవయసులో తమ తిరుగుబాటు తత్వాన్ని కొత్తగా పుట్టిన ఉద్యమాలు ఆకర్షించాయి. అప్పటి వరకూ ఉన్న విధానాల మీద, నాయకుల మీద తాము తిరుగుబాటు చేశారు. ఇప్పుడు క్రాంతికి అట్లాంటి ఉద్యమాలు లేవు. ఉన్నవాటిని నమ్మలేకపోతోంది. ఈ దశ దాటితే మామూలైపోతుంది' అనుకున్నాడు. అదే గిరిజతో చెప్పాడు.

గిరిజ సమాధాన పడలేకపోయింది.

"తన పిల్లకాదుగా మీ స్నేహితుడు ఏమైనా చెబుతాడు. నాకు క్రాంతి వరస చూస్తుంటే గుండెలు పగిలిపోతున్నాయి. ఒక్క కూతురు- దానికి మన పొడ గిట్టదు. ఇంతా చేసి అది ఎట్లా ఆడిస్తే అట్లా ఆడుతున్నాం. ఏమిటిది? ఇదంతా మనకే ఎందుకు జరుగుతోంది? అందరి పిల్లలూ హాయిగా చదువుకుంటుంటే, మనమ్మాయికే ఇలాంటి బుద్ధులు ఎందుకు పుట్టాలి?"

గిరిజ ఇట్లా మాట్లాడుతున్నప్పుడు మౌనంగా ఉండడమే ఉత్తమమని అతనికి తెలుసు. ఆమె ఆ చాదస్తంతో ఎంత దూరమైనా పోగలదు. గిరిజకు రోజు రోజుకూ మనశ్శాంతి కరువైపోతోంది. గుండెల మీద కుంపటి అంటే ఇదేనని పిస్తోంది. ఈ పరిస్థితి ఇట్లా ఎంతకాలం

కొనసాగుతుందో ఆమెకు అర్థం కావడం లేదు. నెలలు గడిచిపోతున్నాయి. క్రాంతి కాలేజీ, పరీక్షలూ అనే మాట ఎత్తడం లేదు.

తల్లీకూతుళ్ళు నాలుగు మాటలు మాట్లాడుకునే సరికి ఇద్దరికీ గొంతులు పెరిగేవి. గిరిజకు కోపం ఆగేది కాదు. ముకుందరావు ఎవరికీ ఏమీ చెప్పలేక సతమతమయ్యేవాడు. 'ఒక గాడి నుండి జీవితం కాస్త పక్కకు వస్తే ఎట్లా తల్లకిందులవుతామోగదా' అనుకుంటున్నాడు.

ఇంతకూ జరిగిందేమిటి? ఏమీ లేదు.

'క్రాంతి కొన్ని అభిప్రాయాలు చెబుతోంది. చెప్పనిద్దాం. చదువు మానేసినా మంచి పుస్తకాలు చదువుతోంది. నెమ్మదిగా తానే మారుతుంది'.

ఇట్లా అనుకుంటున్న ముకుందరావు నెత్తిన ఒకరోజు పిడుగు పడింది.

"నాన్నా - నేను ఈ ఇంట్లోంచి వెళ్ళిపోదామనుకుంటున్నాను" అంది క్రాంతి చాలా మామూలుగా.

ముకుందరావుకి చాలాసేపు ఆ మాట అర్థమే కాలేదు.

"ఎక్కడికి? ఎందుకు?" చాలాసేపయ్యాక అడిగాడు.

"ఎక్కడికో నాకు సరిగ్గా తెలియదు. నాకే నిశ్చయంగా తెలియదు ఏం చేస్తానో. కానీ ఇక్కడ ఇలా ఉండలేకపోతున్నా".

"అసలు నీ బాధేమిటమ్మా?"

"నాకు జీవితానందం కావాలి నాన్నా. ఇక్కడ- ఈ ఇంట్లో నాకది దొరకదు. అసలు ఆ ఆనందం ఎక్కడైనా దొరుకుతుందా అనేది కూడా నాకు తెలియదు. కానీ, దానికోసం, వెతకాలి అని మాత్రం గట్టిగా అనిపిస్తోంది. ప్రయత్నించకుండా లేదనుకోవటం పొరపాటుగదూ?"

ఆనందం మన మనసులోనే ఉంటుందమ్మా. బయట ఎక్కడా ఉండదు. నువ్వు అమ్మనీ, నన్నూ ప్రేమించటంలో ఆనందం పొందవచ్చు. పెళ్ళాడి పిల్లల్ని కని వాళ్ళని పెంచటంలో ఆనందం పొందవచ్చు. డాక్టరై రోగులకు సేవ చేయటంలో ఆనందం పొందవచ్చు. ఆనందం అంటే అది మనం అనుకోవటంలో ఉంటుంది". ముకుందరావు చాలా సహనంగా చెప్పాడు.

"కావచ్చు కాని, మనం అనుకోవాలిగా. మిమ్మల్ని ప్రేమించటం అంటే మీ అర్థంలో వేరు, నేను అనుకునేది వేరు. అసలు నేనూ, నా కోరికలూ వేరు. వాటిని వదులుకుని నన్ను నేను పోగొట్టుకుని, అతి మామూలుగా బతికితే అది నాకు నేను అన్యాయం చేసుకున్నట్టే. దాని మూలాన నాకేమీ ఆనందం రాదు. కనీసం వస్తుందని నాకనిపించడం లేదు. ఆనందం బయటినుంచి కూడా లోపలికి రావాలి. బయట అనేది లేకుండా లోపల ఎట్లా ఉంటుంది? లోపలా, బయటా - రెండూ ముఖ్యమే. ఈ రెండింటి మధ్య సయోధ్య కుదిరితేనేగాని ఆనందం దొరకదేమో. నాకు ప్రయత్నించాలని ఉంది. నామార్గం నేను వెతుక్కుంటాను. అట్లా

చెయ్యకుండా నాలో బలంగా ఉన్న ఆలోచలనన్నీ నేనిక్కడే ఉండి అణిచేసుకుంటే చాలా వికృతంగా తయారవుతాయనిపిస్తోంది".

"నీ జీవితానికో లక్ష్యం, ఆదర్శం లేవామ్మా?"

"అది వెతుక్కోటానికే వెళ్ళాలంటున్నాను. లక్ష్యం కనపడుతుంటే, దాని కోసం వెళ్లానంటే మీకు అర్థమవుతుంది. నేను లక్ష్యాన్నీ, ఆదర్శాన్నీ వెతుకుతానంటే మీకు భయంగా ఉంది. ఎందుకంటే, మీ తరానికి ఆదర్శాలు ముందే ఏర్పడిపోయాయి. ఒక చట్రంలోంచి ఇంకో చట్రంలోకి వచ్చిపడ్డారు. ఇది నచ్చకపోతే మళ్ళీ ముందున్న చట్రంలోకి వెళ్ళిపోగలుగుతారు చాలా తేలికగా. నాకు అన్ని చట్రాలూ అణచివేసేవిగానే కనపడుతున్నాయి. చిన్నతనంలో మీ సంఘాలు నన్ను ఆకర్షించకపోలేదు. అయితే, మీరు పనిచేసే సంఘంలో అధికారాన్ని భరించలేక మీరు బయటికి వస్తున్నకొద్దీ నా మీద మీ అధికారం పెరిగింది. అది మీకు అర్థంకాదు. అదంతా ప్రేమంటారు. కానీ, పెద్దవాళ్ళ ప్రేమలో ఉండే అధికారం, అణచివేత పిల్లలకే తెలుస్తుంది. చాలామంది పిల్లలకు తెలియదు కూడా. మనింట్లో పనిమనిషికి మనం చేసే దోపిడీ పెత్తనం ఎలా కన్పించదో, అలాగే తలిదండ్రుల పెత్తనం కూడా కన్పించదు. అదంతా ప్రేమ పేరుతో చలామణీ అవుతుంది. ఆ ప్రేమను పిల్లలూ నేర్చుకుని తొందరలో వాళ్ళూ ఈ పాత్రల్ని పోషించటానికి సిద్ధమవుతారు. ఇవి అందరికీ ఎంత అలవాటయ్యాయంటే, వాటిని బ్రేక్ చెయ్యాలనే ఆలోచనే రాదు. నాకు వీటన్నిటి నుంచీ బయటపడాలని ఉంది. మీ బంధాలు, స్నేహితుల బంధాలు, ప్రేమ అనే భావం పెట్టే భ్రమల సంకెళ్ళు అన్నీ తెంచుకుని వీటన్నిటికీ అతీతంగా ప్రపంచంలో నా ఉనికి ఏమిటో పరీక్షించుకోవాలని ఉంది".

క్రాంతి తనను తానే అర్థం చేసుకునే ప్రయత్నం చేస్తున్నదానిలా మాట్లాడింది.

ముకుందరావు వ్యంగ్యంగా అన్నాడు.

"ఇదేం కొత్త మార్గం కాదు. సన్యాసం అంటారు".

"సన్యాసం కాదు. నేను సమాజం నుంచి దూరంగా పోను, సమస్యల నుంచి దూరంగా పోను. వీటన్నిటిలో ఉంటూనే, నా మార్గం నేను వెతుక్కుంటాను. వీటన్నిటిలోని బోలుతనం నిండా జీవనసారాన్ని నింపాలని నాకు ఎంతో కోరికగా ఉంది".

"ఆలోచిద్దాంలేమ్మా".

ముకుందరావుకి దుఃఖాన్ని కంట్రోల్ చేసుకోవడం కష్టంగా ఉంది.

ఈ సంగతి గిరిజకు తెలిస్తే ఆమె గుండె పగిలిపోతుంది. ఎట్లా? ఏం చెయ్యాలి.

ఆడపిల్ల ఇట్లా వెళ్ళిపోవడం ఎక్కడా వినలేదు.

తలిదండ్రులను కాదని ప్రియుడి కోసం వెళ్తారు.

తలిదండ్రులను కాదని సంఘాల్లోకి వెళ్తారు.

భర్తలను కాదని మరో పురుషుడికోసం వెళ్తారు. లేదా గురువుల దగ్గరికో, ఆశ్రమాలకో వెళ్తారు.

వీటన్నిటినీ తిరస్కరించి క్రాంతి ఎక్కడికి వెళ్తుంది? వీటిలో ఎక్కడికి వెళ్ళినా, ఒక భద్రత ఉంటుంది. కానీ, అన్వేషిగా, సత్యాన్వేషిగా, లక్ష్యాన్వేషిగా ఒక అమ్మాయి ఈ ప్రపంచంలోకి వెళ్ళటం ఎక్కడైనా జరిగిందా? తనకు తెలియదు.

తమను ఇబ్బందిపెట్టని ఈ సమాజపు బోలుతనం ఈ అమ్మాయినెందుకు వేధిస్తోంది?

ఏదో ఒక పొర లేకుండా ప్రపంచం నడుస్తుందా? ముకుందరావు గిరిజతో ఈ విషయం చెప్పినరోజు ఆమె అన్నం తినలేదు. మంచం దిగలేదు. ముకుందరావు ఎంత బతిమాలినా ఆమె వినలేదు.

చేసేది లేక క్రాంతితో చెప్పాడు.

క్రాంతి చాలా కోపంగా తల్లి దగ్గరకు వచ్చింది.

"ఎందుకు నన్నిలా హింసిస్తున్నావు?"

గిరిజ తెల్లబోయి చూసింది. ఎవరు ఎవర్ని హింసిస్తున్నారు. ఎట్లాగో ఓపిక తెచ్చుకుని అంది.

"నువ్వు - నువ్వు మమ్మల్ని హింసిస్తున్నావు".

"నా బతుకు నేను బతుకుతానంటే, అది మీకు హింసగా ఉంది. నా దారికి అడ్డంగా ముళ్ళకంపల్లా మీరుండటం, ఆ కంపలు పీకుతుంటే రక్తం కారటం - ఇదంతా నాకు హింస కాదా? నన్ను నా మానాన వదిలెయ్యరెందుకు? నన్నెందుకిలా హింసిస్తారు? నేను ఇప్పుడే వెళ్ళిపోతున్నాను."

గదిలోకి వెళ్ళి ఓ బ్యాగ్ బట్టలు కుక్కుకుని అతి వేగంగా వెళ్ళిపోయింది క్రాంతి.

గిరిజ గుండెలు పగిలేలా ఏడుస్తోంది.

ముకుందరావుకి దుఃఖంతో పాటు కోపం కూడా వచ్చింది.

"గిరిజా - ఏడవకు. ఏ చట్రంలోనూ ఇమడకుండా ఉండటానికి అవంత బటహీనమైనవి కావు. పిచ్చివాళ్ళు తప్ప మనుషులు ఏదో ఒక నిర్మాణంలోకి రాక తప్పదు. ఆక్టోపస్‌లా నిర్మాణాలు మనుషుల్ని లాగేస్తాయి. మనమ్మాయి పిచ్చిది కాదు. ఎప్పటికో ఒకప్పటికి దేన్లోనో ఒకదాన్లో చిక్కుకుంటుంది. నాకెంత కసిగా ఉందంటే, అది ఏదో ఒక చట్రంలో చిక్కుకుని వస్తే ఎగతాళి చేసి ఆనందించాలనిపిస్తోంది. ఆ రోజు కోసం ఎదురుచూద్దాం."

గిరిజకు అంత దుఃఖంలోనూ భర్తను చూస్తుంటే భయం వేసింది. కూతురి గురించి అప్పటివరకూ లేని కొత్త భయం ఏదో ఆమె మనసులో పుట్టుకొస్తోంది. కూతురు ఓడిపోగూడదనే కోర్కె ఆ క్షణాన ఆమె మనసులో ఆమె కనిపెట్టలేనంత సూక్ష్మ రూపంలో అంకురించింది.

*- ఇండియా టుడే, ఆగస్టు 21-5 సెప్టెంబర్, 1995*